

## ఆటోల్లో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆటోల్లో శాసనసభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆటోడ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఖాకీ అంగీలు ధరించి ఆటోల్లో అసెంబ్లీకి బయలుదేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు ఆటో నడిపారు. ఉదయం నుంచి సభలు వాయిదాపడే దాకా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఖాకీ అంగీ ధరించే ఉన్నారు.

## లోకం పోకడ




బడి పిల్లలు కల్తీ మధ్యాహ్న భోజనం బారిన పడకుండా జాగ్రత్త పడతారంటే ఇలా చేస్తారనుకోలేదు!

## దమ్ముంటే ఫార్ములా-ఈ రేస్‌పై
# చర్చ పెట్టు

- మీడియాకు సీఎంవో లీకులు ఇచ్చుడు కాదు
- నాలుగు గోడల మధ్య చర్చ కన్నా, నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరగాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంపై శాసనసభలో చర్చ పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై నాలుగు గోడల మధ్య చర్చ కన్నా ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. 'ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార ఆరోపణలు చేస్తున్నది. ఇదే విషయంపై ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయి.

### మీడియాలో అవాస్తవాల ప్రచారం

తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్నివర్గాల మన్ననలు అందుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల లబ్ధి చేకూరిందని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగాల్సి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దానిని ఏకపక్షంగా రద్దు చేసింది. అప్పటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగిందనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది.

### ఒప్పందం పారదర్శకం

నిజానికి ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని ఇదివరకే నేను వివరంగా చెప్పాను. అయినా మీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉన్నది. కనుక మీరు శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసనసభ వేదికగా చెప్తాం. శాసనసభ జరుగుతున్నది కనుక మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టండి. ఫార్ములా-ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేసును కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారు. దీనిపైన శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయి' అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

## స్పీకర్‌కు బీఆర్ఎస్ఎల్పీ వినతి

ఫార్ములా-ఈ రేసింగ్ వ్యవహారంపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చ పెట్టాలని బీఆర్ఎస్ శాసనసభా పక్షం స్పీకర్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్ములా-ఈ రేస్ నిర్వహణలో కేటీఆర్ ఎటువంటి పొరపాట్లు చేయలేదని అన్నారు. నిబంధనల మేరకే నిర్వాహకులకు చెల్లింపులు జరిపినట్టు కేటీఆర్ ఇప్పటికే స్పష్టంచేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం మాత్రం ఫార్ములా-ఈ రేసింగ్ వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ నిరాధార ఆరోపణలు చేస్తూ కక్షపూరితంగా బీఆర్ఎస్ పార్టీపై, కేటీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని పేర్కొన్నారు. నాలుగు గోడల మధ్య కాకుండా నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలకు నిజానిజాలు తెలియజేసేందుకు అసెంబ్లీ వేదికగా తమ పార్టీ నేత కేటీఆర్ చర్చకు సిద్ధంగా ఉన్నారని, కాబట్టి ఈ అంశాన్ని సభలో చర్చించేలా సభాపతి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్, విజయుడు, కే మాణిక్‌రావు, చామకూర మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఆటోడ్రైవర్ల హామీలను నెరవేర్చాలి
## ఏటా రూ.12 వేల చొప్పున భృతి ఇవ్వాలి

- కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ప్రతి జిల్లా కేంద్రంలో ఆటోనగర్ నిర్మించాలి
- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆలింగనం చేసుకుంటున్న మధుసూదనచారి

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తేతెలంగాణ): ఎన్నికల ముందర ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మెల్సీలు కవిత, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, దేశపతి శ్రీనివాస్, తాతా మధు, నవీన్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎల్ రమణ తదితరులతో కలిసి మండలి మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల భృతి ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లా కేంద్రంలో ఆటోనగర్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లను ఆదుకోవాలింది పోయి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని పేర్కొన్నారు. ఆటో కార్మికులు అధైర్యపడొద్దని బీఆర్ఎస్ అండగా ఉంటుందని, సమస్యలు పరిష్కారమయ్యేదాకా అసెంబ్లీలో పోరాడతామని మధుసూదనాచారి భరోసా ఇచ్చారు.

### గ్యాస్ కాదు.. బోగస్ స్కీం: తక్కళ్లపల్లి రవీందర్‌రావు



అధికారంలోకి రాగానే పేదలకు ఏడాదికి ఆరు సిలిండర్లను రూ.500 చొప్పున అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆచరణలో విఫలమైందని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. 95 లక్షల మంది దరఖాస్తు చేసుకొంటే కేవలం 42 లక్షల మందికే, అది కూడా రెండు, మూడు సిలిండర్లకే వర్తింపజేయడం విడ్డూరమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మండలిలో మంత్రిని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నిస్తే సరైనా సమాధానం చెప్పకుండా పారిపోయారని ధ్వజమెత్తారు.

### లక్ష్మీభవానికి మెరుగైన వైద్యం అందించాలి: తాతా మధు

ప్రభుత్వ పాఠశాలలో ఎలుకలు కరవడంతో తీవ్ర అస్వస్థతకు గురై ఖమ్మం దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లక్ష్మీభవానికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఎమ్మెల్సీ తాతా మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా దానవాయిగూడెం గ్రామానికి చెందిన బాలిక కాళ్లు చచ్చుబడిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరోగ్య నిబంధలకు విరుద్ధంగా ఆమెకు ఏడుసార్లు ర్యాబిస్ వ్యాక్సిన్ ఎక్కించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాల పరిస్థితి అధ్వానంగా తయారైందని, ఏడాది పాలనలో 48 విద్యార్థులు మరణించడమే ఇందుకు నిదర్శనమని విమర్శించారు.

### అంగన్‌వాడీలను ఆదుకోవాలి: సత్యవతి రాథోడ్



అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఆదుకోవాలని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి ఏడాదైనా అతీగతీలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వేతనాలను రూ.18 వేలకు పెంచాలని, 30 వేల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

### 'పాలమూరు-రంగారెడ్డి'పై వివక్ష: నవీన్‌రెడ్డి



కేసీఆర్ హయాంలో 12.50 లక్షల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో నిర్మించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సకాలంలో పూర్తిచేయాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా గతంలోనే 90 శాతం పూర్తయిన ప్రాజెక్టును పూర్తిచేయలేకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు చెందిన ప్రాజెక్టుపై ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థంకావడంలేదని పేర్కొన్నారు.

# ఆటోడ్రైవర్ల సమస్యలపై చర్చించాలి

- సర్కారు ముందుచూపులేని విధానాలతోనే ఆత్మహత్యలు
- అసెంబ్లీలో బీఆర్ఎస్ వాయిదా తీర్మానం
- ఖాకీ చొక్కాలతో హాజరైన బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ): ఆటోడ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఉదయం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు నేతలు వాయిదా తీర్మానం ఇచ్చారు. ప్రభుత్వ ముందుచూపులేని విధానాలతోనే రాష్ట్రంలో ఆటోడ్రైవర్లు ఉపాధి అవకాశాలను కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాయిదా తీర్మానంలో పేర్కొన్నది. ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా రూ.12వేలు ఆర్థికసాయం అందించాలని పేర్కొన్నది. ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని బీఆర్ఎస్ ప్రతిపాదించింది.

### ఖాకీ చొక్కాలతో అసెంబ్లీకి..

సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఆటోడ్రైవర్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బాసటగా నిలిచారు. అసెంబ్లీ వేదికగా ఎలుగెత్తి చాటిచెప్పేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేతలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పద్మారావు గౌడ్, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్‌జాదవ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌తో సహా నేతలందరూ ఖాకీ చొక్కాలను ధరించి శాసనసభకు వచ్చారు. ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 93మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల జాబితాను ఇచ్చామని, అయినప్పటికీ వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదని నిప్పులు చెరిగారు. ఆటోడ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని, న్యాయం జరిగేవరకూ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పక్షాన పోరాడతామని కేటీఆర్ ఉద్ఘాటించారు.

### రేపు ఆటోడ్రైవర్ల చలో అసెంబ్లీ

- మద్దతు పలికిన బీఆర్ఎస్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చిన ప్రభుత్వం తమను మరోసారి మోసం చేసిందని ఆటోడ్రైవర్ల జేఏసీ మండిపడింది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా శుక్రవారం అసెంబ్లీ ముట్టడి చేపట్టనున్నట్టు జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సమావేశమైన ఆటోడ్రైవర్ల జేఏసీ నేతలు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా రేవంత్‌రెడ్డి సర్కార్‌లో చలనం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

#### మాటతప్పిన మంత్రి

డిసెంబర్ 7న తాము బంద్‌కు పిలుపుచ్చిన సమయంలో చర్చలు జరిపి, హామీలిచ్చిన రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తమను మోసం చేశారని ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకులు మండిపడ్డారు. తమకు మద్దతుగా ఖాకీ చొక్కాలు ధరించి, ఆటోలు నడుపుకుంటూ అసెంబ్లీకి వెళ్లి గొంతెత్తిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఆటోడ్రైవర్లు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జేఏసీ నేతలు వేముల మారయ్య, వెంకటేశం, వెంకటేశ్, ప్రవీణ్, సలీం పాల్గొన్నారు.

# బిల్లుల చెల్లింపునకు 10% కమీషన్

- విదేశీ విద్యానిధినీ వదలని కక్కుర్తి
- ఎమ్మెల్యే వివేకానంద మండిపాటు
- చెల్లింపులు పూర్తిగా నిలిపేశారు: మర్రి
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై ధ్వజం
- మార్చిలోగా 104 కోట్లు చెల్లిస్తాం: మంత్రి సీతక్క



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్18 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో 10% కమీషన్ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే వివేకానంద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో విదేశీ విద్యానిధి పథకంపై ఎమ్మెల్యేలు వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, అనిల్‌జాదవ్ పలు ప్రశ్నలను సంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ విదేశీ విద్యానిధి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపేసిందని, 3,4 విడతల నిధులను విడుదల చేయకపోవడంతో విదేశాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని కొనసాగిస్తారా? లేదా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. 10 శాతం చెల్లిస్తేనే బిల్లులు చెల్లిస్తున్నారని, విదేశీ విద్యానిధి పథకం ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సాయంలో రూ.5 లక్షలను తీసుకుంటున్నారని ఎంఐఎం ఎమ్మెల్యే సైతం గతంలో ప్రస్తావించారని వివేకానంద ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎంత మందిని ఎంపిక చేశారు? ఎన్ని నిధులను ప్రభుత్వం విడుదల చేసింది? అనే వివరాలను అందివ్వాలని డిమాండ్ చేశారు.

### విదేశీ విద్యానిధికి 30 కోట్లే విడుదల: మర్రి రాజశేఖర్‌రెడ్డి

విదేశీ విద్యానిధి పథకానికి కేవలం రూ. 80 కోట్లు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని, అందులో ఇప్పటివరకు రూ.30 కోట్లనే విడుదల చేసిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బ్రాహ్మణ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసే ప్రక్రియ పూర్తిగా మందగించిందని తెలిపారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ రెండో, మూడో విడత చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయని వివరించారు. ప్రభుత్వం ఈ స్కాలర్‌షిప్ ఇస్తుందా? లేదా? అన్న విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విదేశీ విద్యానిధి పథకాన్ని గతంలో లాగానే నిరాటంకంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విదేశీ విద్యానిధి పథకాన్ని ప్రభుత్వం ఎత్తివేసే ఉద్దేశం తమకు లేదని మంత్రి సీతక్క స్పష్టంచేశారు. ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధామిచ్చారు. ఇప్పటివరకు 8,723 మంది ఈ పథకం ద్వారా విదేశాల్లో ఉన్నతవిద్యను అభ్యసించేందుకు వెళ్లగా, వారికి రూ.1396.25 కోట్లను చెల్లించామని, ఇంకా 2వ, 3వ విడతలకు సంబంధించి రూ.104.42 కోట్లను మార్చిలోగా చెల్లిస్తామని మంత్రి తెలిపారు.



వనపర్తిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసిన ఆటో యూనియన్ కార్మికులు

### ఆటోవాలాలను బజారుకీడ్చారు

- బీఆర్ఎస్ అండగా ఉంటుందన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోవాలాల బతుకులను బజారుకీడ్చిందని బీఆర్ఎస్ అనుబంధ ఆటో యూనియన్ కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. అనంతరం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆటో బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రేవంత్ సర్కారు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిందని ధ్వజమెత్తారు.

### విభజన చట్టానికి అనుగుణంగా కేంద్రం నిధులు కేటాయించాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తేతెలంగాణ): విభజన చట్టానికి అనుగుణంగా కేంద్రం రాష్ట్రానికి బయ్యారం ఉక్కు కర్మాగారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు కేటాయించడం లేదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. బుధవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రం ఈ ఏడాది రాష్ట్రానికి ఎన్ని నిధులు కేటాయించిందని ప్రశ్నించారు..

### సీతారామ ఎప్పటిలోగా పూర్తిచేస్తారు?: తాతా మధు



సీతారామ ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన నడుస్తున్నాయని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు ఏ దశలో ఉన్నాయి, మిగిలిన పనులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు.

### గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి: పోచంపల్లి



రాష్ట్రవ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, మినిమం స్కేల్ చెల్లించాలి. రాష్ట్రంలోని 428 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది 18 ఏండ్లుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో టైంస్కేల్ ప్రకటించి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

### ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి: జీవన్‌రెడ్డి



విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలి. గతంలో ప్రభుత్వంలో విలీనం చేశామన్నారు. కానీ అవుట్‌సోర్సింగ్ ద్వారా వారికి వేతనాలు ఇస్తున్నారు. వేతనం పూర్తిగా ప్రభుత్వం చెల్లిస్తున్నప్పటికీ వాటిలో అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలు కోత విధిస్తున్నాయి. కార్మికశాఖలో విలీనం చేస్తే 20వేల మందికి లబ్ధి చేకూరుతుంది.

### ఉద్యమకారులకు న్యాయం చేయాలి: ఎల్ రమణ



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి. ఉద్యమ సమయంలో కేసులు నమోదైనవారికి ఆర్థిక సాయం అందించాలి. విద్యార్థినులకు స్కూటీలు పంపిణీ చేయాలి.

### బీఆర్ఎస్ హయాంలోనే పర్యాటకాభివృద్ధి: దేశపతి



కేసీఆర్ హయాంలోనే తెలంగాణలో పర్యాటకాభివృద్ధికి పునాది పడిందని శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్ తదితరులు తెలిపారు. కేసీఆర్ హయాంలోనే సమ్మక్క సారలమ్మ, రామప్ప ఆలయం, బతుకమ్మ పండగ వంటి సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షింపబడ్డాయని చెప్పారు. గతంలో పర్యాటక రంగం కుంటుపడిందంటూ తప్పుడు లెక్కలు చెప్పిన కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు.

### శాంతిభద్రతలతోనే పర్యాటక అభివృద్ధి: శేరి సుభాష్‌రెడ్డి



రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుంటేనే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. టూరిజం అభివృద్ధికి సహకరిస్తామని, కానీ ప్రభుత్వ నిర్ణయాల్లో కొన్ని దురుద్దేశాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. పర్యాటక స్థలాలను ప్రైవేటీకరిస్తే ప్రభుత్వానికి ఆదాయం రాకపోవచ్చని అభిప్రాయపడ్డారు.

### మాట్లాడితే సస్పెండ్ చేస్తా.. కౌశిక్‌రెడ్డికి స్పీకర్ వార్నింగ్

మాట్లాడితే సస్పెండ్ చేస్తా అంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ వార్నింగ్ ఇచ్చారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆటోడ్రైవర్ల సమస్యలపై చర్చించాలని బీఆర్ఎస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు లేచి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అదేవిధంగా ప్రశ్నోత్తరాల సందర్భంగానూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మరోసారి మాట్లాడితే సస్పెండ్ చేస్తా అంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి స్పీకర్ వార్నింగ్ ఇచ్చారు.